# దక్కన్ మాల్ కూల్చివేత సమాప్తం

**ఎలాంటి నష్టం లేకుండా ఉన్న చోటనే కూలింది**

**వారం రోజుల భవనం కూల్చివేతల ప్రక్రియ పూర్తి**

**వ్యర్థాల తొలగింపు ప్రక్రియ మిగిలింది**



దక్కన్ మాల్ భవనం కూలిపోయిన దృశ్యం

బేగంపేట ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని మినిస్టర్ రోడ్డులో ఇటీవల భారీ అగ్ని ప్రమాదానికి గురైన దక్కన్‌మాల్ కూల్చివేతల ప్రక్రియను వారం రోజుల క్రితం ప్రారంభించారు. అయితే భవనం ఆదివారం ఉదయం దక్కన్‌మాల్ పూర్తిగా నేలమట్టం అయింది. వారంరోజుల క్రితం చేపట్టిన కూల్చివేత పనులు జరుగుతుండగా నేటితో దక్కన్ మాల్ పూర్తిగా నేలమట్టం అయింది. భవనం నేల మట్టం కావడంతో శిధిలాలను తొలగించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేసారు. ఈ భవనం ఎల్ ఆకారంలో ఉండటంతో అగ్ని ప్రమాదానికి గురైన తరువాత పక్కన, భవనం వెనుక ఉన్న బస్తీ వాసుల ఇళ్లపై ఎక్కడ కూలుతుందో అన్న ఆందోళనను ప్రజా ప్రతినిధులు, అధికారులు వ్యక్తం చేసారు. భవనం కూల్చివేతలో ఎలాంటి ఆస్తి,ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నాలుగు రోజుల క్రితం దక్కన్ మాల్ భవనాన్ని భారీ యంత్రంతో కూల్చివేస్తుండగా ఒక్కసారిగా సగం భవనం కుప్పకూలింది. 5 అంతస్థుల భవనం ఒక్క సారిగా కుప్ప కూలడంతో అక్కడి వారంతా భయాందోళనలకు గురయ్యారు. అయితే ఈ సమయంలో చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. భవనానికి సమీపంలో ఉన్న బస్తీ వాసులను అధికారులు ముందస్తుగా అక్కడి నుంచి ఖాళీ చేయించారు. దీంతో ప్రాణా పాయం జరగలేదనే చెప్పవచ్చు. ఇక భవనానికి చుట్టు పక్కల పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసారు. గత నెల 19న దక్కన్ మాల్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం పాఠకులకు విధితమే. భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో ఈ భవనం నాణ్యత లోపించిన కారణంగా దీన్ని కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. కూల్చివేతలకు సంబంధించి రూ 33.86లక్షలతో టెండర్ నోటిఫికేషన్ ఇవ్వగా రూ 25.94లక్షలకే తాము పనిచేస్తామని ఎస్.కె.మల్లు కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పని దక్కించుకుంది. మాల్ కూల్చివేతకు యంత్ర సామాగ్రిని తెచ్చి సిద్ధమైంది. అయితే అదే రోజు సాయంత్రానికి జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఎస్.కె.కాంట్రాక్టును రద్దు చేసింది. ఇదే పనిని రూ 33లక్షలకు పనులు చేస్తా మంటూ ముందుకు వచ్చిన మాలిక్ ట్రేడర్స్‌కు పనిని అప్పగిం చింది. ఈ క్రమంలో కాంట్రాక్టర్ భారీ జేసీబీ యంత్రాన్ని తెచ్చి పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ఈ రోజు దక్కన్ మాల్ భవనం ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా ఉన్న చోటనే నేలమట్టం కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, బస్తీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక భవనంలో శిధిలాలను తొలగించే పనులను అధికారులు ముమ్మరం చేసారు.

**కనిపించకుండా పోయిన ముగ్గురి ఆచూకి పై స్పష్టత ఏదీ?**

దక్కన్‌మాల్ భవనం అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ముగ్గురు వ్యక్తులు గల్లంతయినట్లు తెలుస్తుంది. అయితే భవనం మొదటి అంతస్తు లిఫ్ట్ సమీపంలో శిధిలాలు తొలగిస్తుండగా ఎముకల అవశేషాలు లభ్యమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది. క్లూస్ టీం సభ్యులు వాటిని డీఎన్‌ఏ పరిక్షల కోసం గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. అయితే ఆ అవశేషాలు ఒకరివా, ఇద్దరివా, ముగ్గురివా అనేది తెలియలేదు. రిపోర్ట్ వచ్చిన తరువాతనే ఆ విషయం వెల్లడయ్యే అవకాశం ఉంది.



హైదరాబాద్ వార్త

## కెసిఆర్ కుటుంబ పాలనకు స్వస్తి చెప్పాలి

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



జిల్లా బిజెపి కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తెలంగాణలో ప్రజలను మోసగిస్తూ, మభ్యపెడుతున్న ముఖ్య మంత్రి కేసిఆర్ కుటుంబ పాలనకు స్వస్తి చెపేందుకు బిజెపి నాయకులు, కార్య కర్తలు సైనికుల్లా పనిచే యాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాత్రి కంటోన్మెంట్ బాలంరాయిలీ ప్యాలెస్‌లో నిర్వహించిన మహంకాలి జిల్లా బిజెపి విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామక్రిష్ణ, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బిజెపి ఇన్‌ఛార్జి నాగురామ్, మాజీ మేయర్, బండ కార్తీకరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, నాయకులు భానుక మల్లికార్జున్, అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్, సి.హెచ్. కన్నాభిరామ్, నాగభూషణ్, విజయానంద్ పాల్గొన్నారు.

### గట్టుమైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5, ప్రభాత వార్త: ఘట్‌కేసర్‌లో గట్టుమైసమ్మ మినీ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి గుట్టపైన అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. శ్రీగట్టుమైసమ్మగుట్ట దేవాలయంలో సంక్రాంతి అనంతరం వచ్చిన ఆదివారం జాతర నిర్వహించగా తర్వాత నాలుగు వారాలు కూడా మిని జాతర జరుగుతుంది. డప్పుశబ్దాలు, శివసత్తులతో ఊరేగింపుగా వచ్చి గట్టుమైసమ్మతల్లికి బోనాలు సమర్పించారు. దేవస్థానం ఈఓ ఎల్. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేసి సిబ్బంది బోనాలు, అర్చన, కోళ్లు, మేకల బలికి టిక్కెట్ వసూలు చేశారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## కూకట్‌పల్లిలో డ్రగ్స్ ముఠా అరెస్టు

**కూకట్‌పల్లి సైబరాబాద్ ఎస్.ఓ.టీ పోలీసుల జాయింట్ ఆపరేషన్**

**18 గ్రాముల నిషేదిత ఎం.డి.ఎం.ఎ డ్రగ్స్, 4 సెల్ ఫోన్లు స్వాధీనం**

**5 గురి అరెస్టు, మరొకరి కోసం గాలింపు**



స్వాధీనం చేసుకున్న సొత్తును మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాసరావు

మూసాపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : బాలానగర్ జోన్, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ఐదుగురు సభ్యుల డ్రగ్స్ ముఠాను వలపన్ని అరెస్టు చేయడం జరిగింది. కూకట్‌పల్లిలో ఆదివారం జరిగిన విలేకరుల సమా వేశంలో బాలానగర్ జోన్ డిసిపి శ్రీనివాసరావు కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలో డ్రగ్స్ అమ్మేవారిపై అలాగే కొనేవారిపై నిఘా పెంచిన పక్షంలో గత శనివారం మాదక ద్రవ్యాల ముఠాపై పక్కా సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్.ఓ.టి పోలీసులు, కూకట్‌పల్లి పోలీసులు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్‌లో రంగధాముని చెరువుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని విచారించగా వారి వద్ద 18 గ్రాముల ఎం.డి.ఎం.ఎ పేరు గల నిషేధిత మాదక ద్రవ్యాల ప్యాకెట్లను, 4 సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అరెస్ట్ అయిన వారిలో హారికృష్ణ, సాయికుమార్, కిరణ్‌తేజ్, పవన్‌కుమార్, రఘునందన్ సాంబమూర్తి. కాగా వీరిలో సాయికుమార్ అనే వ్యక్తి బెంగుళూరులో ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ అక్కడ అలీ అనే నైజీరియన్‌తో సంబంధాలు ఏర్పరుచుకుని డ్రగ్స్‌ను హైదరాబాద్ తరలించి వ్యాపారం చేస్తున్నట్లు డిసిపి తెలియజేశారు. అరెస్టు అయిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించి ఇంకొక నైజీరియన్ నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. మాదక ద్రవ్యాల సరఫరాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలియజేశారు.


## మణికొండలో వైభవంగా మల్లన్న స్వామి కల్యాణోత్సవం



మణికొండలో జరిగిన మల్లన్న స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మణికొండలో మల్లన్న స్వామి కళ్యాణోత్సవం వైభవంగా సాగింది. వందలాది మంది భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సాగిన కళ్యాణోత్సవ వేడుకలు ఆహుతులను భక్తిసాగరంలో ముంచెత్తాయి. ఆ ప్రాంతమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లన్న నామ స్మరణంతో దద్దరిల్లింది. ఈ వేడుకలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆచార, సాంప్రదాయాలను పాటించాలని, భావి తరాలకు వాటిని అందించేందుకు ఇలాంటి వేడుకలు ఉపకరిస్తాయన్నారు. భగవన్నామ స్మరణం చేయడం వలన మనలోని అహంకారం, పాపాలు తొలగిపోతాయన్నారు. పెద్దలంతా నిత్యం దేవాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని, వెంట మన వారసులను తీసుకెళ్లాలని తెలిపారు. ఆలయాలకు వెళ్లడం వలన మనలోని ఆందోళన, అలసట అంతా తీరి నూతనోత్తేజం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నేత పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్ కావ్యశ్రీ తదితర కురుమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వ విద్యాలయంలో క్రీడలు, సాంస్కృతిక పోటీలు



క్రీడల పోటీలలో పాల్గొన్న వివిధ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

చార్మినార్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో ఈ నెల 4వ తేదీన ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయ అంతర కళాశాల క్రీడలు, లలిత కళలు, సంస్కృతిక పోటీలు 8వ తేదీ వరకు జరగనున్నాయి. ఆదివారం జరిగిన పలు పోటీలలో 9 కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. బాలురు విభాగంలో వాలీబాల్ క్రీడల పోటీలో రాజేంద్రనగర్ కళాశాల, జగిత్యాల కళాశాల ఫైనల్‌కు చేరుకున్నాయి. క్రికెట్ పోటీలలో అశ్వారావు పేట, పాలెం, రాజేంద్రనగర్ కళాశాలలు సెమీ ఫైనల్‌కు చేరుకున్నా యి. ఫుట్‌బాల్ క్రీడల పోటీలలో రాజేంద్రనగర్, జగిత్యాల కళాశాలు సెమీ ఫైనల్‌కు చేరుకోగా, బాస్కెట్ పోటీలలో అశ్వారావు పేట, సిరిసిల్లా, రాంజేంద్రనగర్ కళాశాలలు సెమీఫైనల్‌కు చేరుకున్నాయని రాజేంద్రనగర్ వ్యవసాయ వ్యవసాయ కళాశాల డీన్ తెలిపారు. లలిత కళలు, సంస్కృత పోటీలలో భాగంగా క్విజ్, కొల్లేట్, సోలో సాంగ్ గ్రూప్ సాంగ్ పోటీలను నిర్వహించటం జరిగిందని, మూడు రోజులలో పోటీలకు చెందిన ఫలితాలను ప్రకటించనున్నామన్నారు.

# కాస్త ఆలోచించకపోతే.. నష్టపోతాం

యాప్‌లపై కొరడా ఝుళిపించిన కేంద్రం..

అడ్డగోలుగా పుట్టుకొస్తూ ప్రజలను ఆకర్షించి ఆ తర్వాత వారి మానసిక వేదనకు కారణమవుతున్న రుణ, బెట్టింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఈ యాప్‌ల ద్వారా చిన్న మొత్తంలో రుణాలు పొందిన సామాన్యుల్ని ఘోరంగా దోపిడికి, వేధింపులకు గురిచేసి అనేక మంది ఆత్మహత్యలకు దారితీస్తోన్న యాప్‌ల వ్యవహారంపై కేంద్రం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రజల నుంచి వస్తోన్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని చైనాతో సంబంధం ఉన్న 138 బెట్టింగ్ యాప్‌లు, 94 రుణ చెల్లింపుల యాప్‌లను అత్యవసర ప్రాతిపదికన నిషేధించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఐటీ శాఖకు హోంశాఖ వ్యవహారాల శాఖ నుంచి ఈ వారంలో ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. కాగా 2020 జూన్ నుంచి కేంద్ర ప్రభుత్వం 2వేలకు పైగా చైనా యాప్‌లపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. వీటిలో టిక్‌టాక్, షేరిట్, వియ్‌చాట్, హలో, లైకీ, యూసీ న్యూస్, బిగో లైవ్, యూసి బ్రౌజర్ తదితర అనేక యాప్‌లు ఉన్నాయి.

- పొంచివున్న ఉచిత యాప్‌లు
- ఉచితంగా వస్తున్నాయని యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నారా?
- అయితే జాగ్రత్త పడాల్సిందే
- ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ గ్రూప్‌లకు వల
- యాప్‌లపై కొరడా ఝుళిపించిన కేంద్రం..!



హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మొబైల్ యాప్ ఉంటే చాలు. బిర్యానీ, సినిమా టిక్కెట్లు, కూరగాయలు, పప్పులు..ఇలా అన్నీ ఇంటికి వస్తున్నాయి. బిర్యానీ కావాలంటే హోటల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. సినిమా టిక్కెట్లు తీసుకోవాలంటే థియేటర్‌కు వెళ్లి ముందుగా తీసుకునే అవసరం లేదు. మొబైల్ యాప్‌లు ఉపయోగిస్తున్న వారంతా సమయాన్ని, సౌకర్యాలను అందిస్తున్నాయని అనుకుంటున్నారు. అయితే అప్లికేషన్లతో సౌకర్యంతో పాటు ప్రమాదాలు పొందిఉన్నాయి. ఉచితంగా వస్తున్నాయని ఎడాపెడా యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నారా? అయితే జాగ్రత్త పడాల్సిందే. ఉచితమంటూ ప్రచారం చేస్తూ వాటిని డౌన్‌లోడ్ చేసుకోగానే ఆయా ఫోన్ల యజమానుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తూ.. అనంతరం బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారని సైబర్ క్రైమ్ అధికారులు చెబుతున్నారు.

ఉచితంగా వచ్చే మొబైల్ అప్లికేషన్లను వినియోగించడమంటే ప్రమాదం వెంట ప్రయాణించడమే. ఇంటర్నెట్ లేకుండా పనిచేస్తుందంటూ ప్రచారం నిర్వహిస్తున్న కొన్ని కంపెనీలు, ఫేస్‌బుక్, ట్విటర్ల ద్వారా ఫలానా కంపెనీల ఉత్పత్తులు ఉచితంగా తీసుకోండి అంటూ ఈ-మెయిల్స్‌కు సందేశాలు పంపుతున్న సంస్థల్లో చాలా వరకు నేరపూరితమైనవే. వీటిని డౌన్‌లోడ్ చేసుకున్న వారి వివరాలను సైబర్ నేరస్థులు సేకరిస్తున్నారు. వీటిల్లో సంస్థలుంటే ఆయా సంస్థల అధికారిక రహస్యాలను దొంగిలించి, వాటిని బహిర్గతం చేస్తామంటూ బెదిరించి డబ్బులు వసూలు చేయడం, వ్యక్తులైతే ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులకు చెబితే ఎక్కడ పరువుపోతుందన్న భావనతో చాలా మంది బాధితులు ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడంలేదు. నేరస్థులు ఉచిత మొబైల్ అప్లికేషన్లను ఫోన్ల వినియోగదారులకు, విద్యార్థులకు, సంస్థలకు ఎరగా వేస్తున్నారు. వారు డౌన్‌లోడ్ చేసుకోగానే ఆయా సంస్థలు, వ్యక్తుల డేటాను చోరీ చేస్తున్నారు. ఈ డేటాను ఆయా కంపెనీల ప్రత్యర్థులకు విక్రయిస్తామంటూ బెదిరిస్తున్నారు. వారు డిమాండ్ చేసిన సొమ్మును ఇచ్చాకే మాల్‌వేర్, రాన్సమ్ వేర్‌లను తొలగిస్తున్నారు. ప్రముఖ కంపెనీలు, బహుళజాతి సంస్థల అధికారిక మెయిల్ ఖాతాలను హ్యాక్ చేసి, వారి వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. బ్యాంకు ఖాతాలు మార్చామంటూ సంస్థల వినియోగదారులకు మెయిల్ చేసి రూ.లక్షల్లో కొల్లగొడుతున్నారు.


**ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ గ్రూప్‌లకు వల..** అర్జంటుగా డబ్బులు కావాలంటూ మీ ఫ్రెండ్ ఫొటో ఉన్న వాట్సాప్ నెంబర్ నుంచి మెసేజ్ వచ్చిందా? దానికి స్పందించే ముందు ఒకసారి చెక్ చేసుకోండి. ఆ మెసేజ్ పంపింది నిజంగా మీ ఫ్రెండేనా కాదాని చూసుకోండి. ప్రొఫైల్ పిక్ చూసి మా వాడేనన్న నిర్ధారణకు రాకండి. ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మోసపోయిన ఉదంతం ఈ జాగ్రత్తలను పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. ఇప్పటి వరకూ ఫేస్‌బుక్ వేదికగా మోసాలు చేస్తున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు రూటు మారుస్తున్నారు. వాట్సాప్‌ను కూడా తమ మోసాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. సాధారణంగా ఫేస్‌బుక్ పేజ్‌లో ఫ్రెండ్స్ లిస్టు ఉంటుంది. వాటి లింక్‌ను క్లిక్ చేస్తే వారి ప్రొఫైల్స్ ఓపెన్ అవుతాయి. ప్రొఫైల్ పిక్స్ కాపీ చేసి వారి పేరుపై ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి అర్జెంట్‌గా డబ్బులు కావాలంటూ మెసేజ్‌లు చేస్తూ డబ్బులు కొట్టేస్తున్న మోసకారుల ఉదంతాలు ఇటీవల చాలానే వెలుగుచూస్తున్నాయి.

## ప్రతి యూనిట్‌కు పక్కాగా బిల్లింగ్

**నాన్ ఐఆర్ మీటర్లకు సాసాయాప్‌తో విద్యుత్ బిల్లులు**

**మ్యాన్‌వల్ బిల్లులకు స్వస్తి.. వందశాతం మీటర్లకు బిల్లింగ్ చేసేలా చర్యలు**

**అంతర్గత సామర్థ్యం, ఆదాయం పెంచే దిశగా విద్యుత్‌శాఖ అడుగులు**



హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: గృహాలు, వ్యాపార సముదాయాల్లో వినియోగించిన ప్రతి యూనిట్ బిల్లింగ్‌లోకి తీసుకువచ్చేలా విద్యుత్‌శాఖ చర్యలు తీసుకుంటుంది. గ్రేటర్‌జోన్‌లోని 9 సర్కిళ్లలో 57లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా రోజు 55 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదువుతంది. విద్యుత్‌శాఖ బిల్లింగ్‌లో తప్పులు జరుగకుండా ఉండేలా ఇప్పటికే గ్రేటర్‌లో 95శాతం ఐఆర్ (ఇన్‌ఫ్రారెడ్) మీటర్లు అందుబాటులోకి తెచ్చింది. మరో 5శాతం నాన్‌ఐఆర్ మీటర్లతో బిల్లింగ్ తీస్తున్నారు. నాన్‌ఐఆర్ మీటర్లు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది మ్యాన్‌వల్‌గా మీటర్లలో నమోదైన రీడింగ్ నమోదు చేసుకుని స్పాట్ బిల్లింగ్ మిషన్లతో బిల్లింగ్ తీస్తున్నారు. మ్యాన్‌వల్ బిల్లింగ్ కారణంగా పలు ప్రాంతాల్లో రీడింగ్‌కు తప్పుగా నమోదు చేయడంతోపాటు, మరికొన్ని ప్రాంతాల్లో ఎంత విద్యుత్ వినియోగించినా నామమాత్రపు బిల్లులు ఇస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో గత కొన్నినెలలుగా విద్యుత్ శాఖ అంతర్గత సామర్థ్యం పెంచడంలో భాగంగా డిస్కంలో 100శాతం మీటర్ రీడింగ్ తీసేలా చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా గత నవంబర్‌నెలలో డిస్కంలో ఉన్న నాన్‌ఐఆర్ మీటర్లకు వందశాతం సాసాయాప్‌తో బిల్లులు జారీ చేశారు.

**సాసాయాప్‌తో నాన్‌ఐఆర్‌కు బిల్లింగ్..** టిఎస్‌ఎస్పీడిసిఎల్ సర్కిళ్లలో ఉన్న నాన్‌ఐర్ మీటర్లకు సాసాయాప్‌తో విద్యుత్ బిల్లులు జారీ చేస్తున్నారు. నాన్‌ఐఆర్ మీటర్ రీడింగ్ ఫోటో తీసి సాసాయాప్‌లో అప్‌లోడ్ చేయగానే నెలలో వినియోగించిన యూనిట్లకు సంబంధించిన బిల్లు వస్తుంది. ఈబిల్లును బ్లూటూత్ సహాయంతో ప్రింటర్‌కు కనెక్ట్ చేసి వినియోగదారుడికి బిల్లు జారీ చేస్తున్నారు. ఈవిధానంలో నాన్ ఐఆర్ మీటర్లలో నమోదైన ఒక్క యూనిట్ కూడా లెక్కలోకి రాకుండా పోయే అవకాశంఉండదని అధికారులు చెబుతున్నారు. సాసాయాప్‌తో మీటర్ రీడర్లు బిల్లుల జారీలో ఎలాంటి అవకతవకలుకు పాల్పడే అవకాశముండదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. నాన్‌ఐఆర్ మీటర్లకు కూడా ఐఆర్ తరహాలో బిల్లింగ్ రావడంతో ప్రతి యూనిట్ బిల్లింగ్‌లోకి వస్తుందని దీంతో డిస్కం ఆదాయం కూడా పెరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

## ఐటీ అధికారులమంటూ వ్యక్తి కిడ్నాప్

**కుటుంబసభ్యుల వద్ద నుంచి 30లక్షలు వసూలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: ఐటీ అధికారులమని చెప్పి వ్యక్తిని కిడ్నాప్ చేసి 30లక్షల వసూలు చేసి ఘటనలో పంజాగుట్ట పిఎస్‌లో కేసు నమోదైంది. యూసఫ్‌గూడ నవోదయ కాలనీలో నివాసం ఉండే అప్పారావు అనే వ్యాపారవేత్త గతనెల 27న తన పిల్లలు స్కూల్‌లో దింపడానికి వెళ్ళాడు. అమీర్‌పేట్ గ్రీన్‌లాండ్ హోటల్ సమీపంలోని స్కూల్‌లో పిల్లలను వదిలేసి తిరిగి వస్తుండగా అతని వాహనానికి అడ్డం తిరిగి ఐటీ అధికారులమంటూ ఎన్నోవా కారులో ఎక్కించుకున్నారు. కార్లో ఎక్కించుకుని కొట్టుకుంటూ రామోజీఫిలింసిటీ సమీపంలోని బాటసింగారం వరకు తీసుకెళ్లారు. ఈసందర్భంగా కోటి రూపాయాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసమయంలో తన భార్యకు ఫోన్ చేసి 30లక్షలు ఏర్పాటు చేయమని కోరగా నాంపల్లి సమీపంలో తమ ముఠా సభ్యులు డబ్బు తీసుకున్నారని తెలిశాక హాయత్‌నగర్ వద్ద అప్పారావును వదిలేశారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తన కుటుంబం మొత్తాన్ని చంపేస్తామని బెదిరించారు. దీంతో ఆందోళనకు గురైన అప్పారావు పంజాగుట్టపిఎస్‌లో ఫిర్యాదు చేశారు.

## ఘనంగా చిత్తారమ్మ పెద్దమ్మల జాతర

**భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తజనం**

శామీర్‌పేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : పొన్నాల్ గండి శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మల జాతర ఆదివారం ఘనంగ జరిగింది. శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న గండి శ్రీచిత్తారమ్మ, శ్రీపెద్దమ్మ అమ్మవార్ల జాతర ఘనంగ జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు ఆ ఆలయాన్ని సందర్శించి జాతరలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. గండి చిత్తారమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల జాతరను పురస్కరించుకుని ఆలయం ప్రాంగణంలో పటం వేసే కార్యక్రమం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ తరువాత ఆలయం వద్ద అగ్నిగుండాలు త్రొక్కె కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవార్లకు బోనాలు చేసి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు పట్‌కర్ గడ్డి రాజు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచు బి.సుకన్యసత్యనారాయణగౌడ్, ఉపసర్పంచు గడ్డం రమేశ్, ఎంపిటిసి మౌనికప్రసాద్, మాజీ సర్పంచు కె.శంకర్, గ్రామవార్డుసభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొని జాతరను ఘనంగ నిర్వహించారు. పొన్నాల్ గ్రామంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. చిత్తారమ్మ, పెద్దమ్మల జాతర సందర్భంగ ఆదివారం టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆ తరువాత ఆలయం నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆయన సన్మానించారు. దీనిలో ఆయనతో పాటు గ్రామ సర్పంచు బి.సుకన్య సత్యనారాయణగౌడ్, ఉపసర్పంచు గడ్డం ప్రసాద్, ఎంపిటిసి మౌనికప్రసాద్, మాజీ సర్పంచు కె.శంకర్, జిల్లా నాయకులు వై.నాగేశ్వర్‌గౌడ్, డి.వెంకటేశ, తుంకి బిక్షపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఒయూలో ఘనంగా అవంతి కాలేజ్ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలను తీసుకుంటున్న విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: నగరంలోని అవంతి డిగ్రీ, పీజీ కాలేజ్ స్నాతకోత్సవ వేడుకలు ఒయూలోని పీజీఆర్‌ఆర్‌సిడిఈ హాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురి విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న ప్రసిడెంట్ ప్రొ. కరుణాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాక్టికల్స్ స్కిల్స్‌ను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసే కుటుంబానికి, కళాశాలకు, దేశానికి పేరుతీసుకురావాలని పేర్కొన్నారు. పరిపూర్ణమైన శిక్షణ ఉంటే ప్లేస్‌మెంట్ మిమ్మల్ని వెతుకుంటు వస్తుందన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఎంఆర్ గ్రూప్ సీఈవో కొరకటిసుకుమార్ మాట్లాడుతూ మార్కెట్ అనుగుణంగా నాలెడ్జ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. రవికుమార్ కోసూరి మాట్లాడుతూ టెక్నాలజీతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్ ఎంతో బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మినిస్టర్ ఫార్చూర్ చైర్మన్, అవంతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఎం. శ్రీనివాస రావు, అవంతి గ్రూప్స్ జనరల్ సెక్రెటరీ డా. ప్రియాంక, హెచ్ఆర్ డైరెక్టర్ డా. వై. జయప్రద, అవంతి పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఎస్. అప్పారావు, ఎంబీఏ హెచ్ఒడి డా. రేణుక, ఎంసీఏ హెచ్ఒడి నవీన్ చంద్ర, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో శివ పడిపూజ మహోత్సవం



శివపూజ మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కేపి వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని నల్లగుట్ట శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ అధ్వర్యంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగ 22వ శివ పడిపూజ మహోత్సవంలో కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ దైవ చింతన, ఆధ్యాత్మిక చింతనలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ఈ శివపూజలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, శ్రీకాంత్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ యుగపురుషుడు : ప్రముఖ సినీ హీరో సుమన్



పురస్కారాలు తీసుకున్నవారితో సినీ నటులు సుమన్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: నందమూరి తారకరామారావు యుగపురుషుడని ప్రముఖ సినీహీరో సుమన్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని 'ఎన్‌టిఆర్ కళారత్న' పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హీరో సుమన్ పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు. తెలుగు జాతి, తెలుగు ఖ్యాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్‌టిఆర్ మానవతామూర్తి అని అన్నారు. కార్యక్రమానికి ముందు ఎన్‌టిఆర్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఎన్‌టిఆర్ పురస్కారాలను డాక్టర్ జి.నాగయ్య, చుక్కా నారాయణరావు, అనీష, సంగెం వెంకటేశ్వర్లు, జె.సత్యనారాయణరావు, మార్గం రాజేశ్, పి.పవన్‌రాజ్, అవదానం భారతి, ఎస్.బ్రహ్మానందాచారి, కుసుమ విజయ, ఓంకారం శ్రీనివాసరాజు, ఆకుల అభిలాష, కల్లగుంట శ్రీకాంత్‌కు అందించి గౌరవించారు. కార్యక్రమంలో అతిథులుగా సినీ దర్శకులు మహేష్‌చంద్, పేర్నపాటి శ్రీరామరాజు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, దారం కుమారస్వామి, ఎస్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాళ్లను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే సాయన్న



4వ వార్డు గాంధీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు


కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: బస్తీ ప్రజల కోసం ప్రభుత్వ నిర్మిస్తున్న కమ్యూనిటీ హాళ్లు పెళ్లిల్లు, శుభకార్యాలకు, సమావేశాలకు ఎంతగానో ఉపయోగపడుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. ఆదివారం 4వ వార్డు పికెట్ గాంధీ నగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యురాలు నళిని కిరణ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు పనస సంతోష్, నివేదిత, పిట్ల నాగేశ్, సంతోష్ యాదవ్, సదానంద్ గౌడ్, ముప్పిడి మధుకర్, జోడి బ్రదర్స్, బస్తీ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు కుమార్, మల్లేశ్, సత్య నారాయణ, ఇస్మయిల్, ప్రభాకర్, సాయికుమార్, విక్కీబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అదానీ గ్రూప్ కంపినీ మోసాలలో మోదీ పరోక్ష పాత్ర ఉంది

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా ఆరోపణ**

సైఫాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీ అనేక ఆర్థిక మోసాలకు పాల్పడి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందని హిండెన్ బర్గ్ ఆర్థిక పరిశోధన సంస్థ ఒక పత్రాన్ని విడుదల చేసిందని, దీనిపైన ప్రధాని నరేంద్రమోదీ నోరుమెదకపోవడం పరోక్షంగా అదానీ మోసాలలో పాత్ర ఉందని భావించవచ్చునని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహా ఆరోపించారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అత్యంత కారు చౌకగా భూములను, సంస్థలను అదానీకి కట్టబెట్టి ఆశ్రిత పెట్టుబడి విధానాన్ని వేగవంతం చేసిందని విమర్శించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, బొగ్గు, విద్యుత్ ప్లాంట్లు, మైన్స్, రైల్వే వంటి తదితర జాతి సంపదను అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా అదానీ గ్రూపుకు వచ్చేలా సింగిల్ టెండర్ విధానాన్ని అమలు చేసిందని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. అతి తక్కువ కాలంలోనే లక్షల కోట్లు సంపాదించి ప్రపంచంలోనే అత్యధిక ధనికుల్లో రెండోస్థానంలో ఎదగడానికి మోదీ ఆర్థిక విధానాలే కారణమన్నారు. ఆధానీ గ్రూప్ మోసాలపైన ఇప్పటికే పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపి అదానీని అతనికి సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అదానీ కుటుంబానికి సంబంధించిన ఆస్తులపైన దర్యాప్తు చేసేలా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం చర్యలు తీసుకునేలా కృషి చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## కెసిఆర్‌ను కలిసిన ఆల్ ఇండియా పవర్‌ఇంజనీర్స్ ఫెడరేషన్




సిఎం కెసిఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న రత్నాకర్‌రావు తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: బిఆర్ఎస్ అధినేత తెలంగాణ సిఎం కెసిఆర్‌ను ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు ఆదివారం నాందేడ్‌లో సిఎం కెసిఆర్‌ను మహారాష్ట్ర ఇంజనీర్ల బృందంతో కలిసి దేశంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న మస్యలను వివరించి తమ పోరాటాలకు మద్దతివ్వాలని కోరింది. ఈసందర్భంగా జాతీయ జనరల్ సెక్రటరీ పి.రత్నాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో మొట్టమొదటిసారిగా ఎలక్ట్రిసిటీ ప్రైవేటీకరణ బిల్లును వ్యతిరేకించిన సిఎం కెసిఆర్‌కు ఆల్ ఇండియా ఇంజనీర్ల సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు బిఆర్ఎస్ పార్టీ తరపున మద్దతిచ్చి పోరాడాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ సంస్థల్లో పాతపెన్షన్ విధానాన్నిఅమలు చేయాలని కోరినట్లు రత్నాకర్‌రావు పేర్కొన్నారు. సిఎంను కలిసిన వారిలో ఏఐపిఈఎఫ్ అడిషనల్ సెక్రటరీ శివశంకర్, టిఎస్‌పిఈఏ సెక్రటరీ జనరల్ పి.సదానందం, వెంకటనారాయణరెడ్డి, జనప్రియ, వి.వి రావు, గోపాల్‌రావు, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి5 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఆదివారం 2002-2003సంవత్సర 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందంగా జరుపుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు హాజరై వారి ఆనందంలో భాగంగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాఠశాల పూర్వ హెడ్‌మాస్టర్ లలిత కుమారి, స్కూల్ ఫౌండర్ అండ్ చైర్మన్ ముద్దాపురం మదన్‌గౌడ్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతమహోత్సవాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతమహోత్సవాలను ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు ఈ వ్రత మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో పి.లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎఎస్‌వి. రమణమూర్తి, డాక్టర్ ఎన్.వెంకటరమణారావు, జి.హరిత, ఓ.మోహన్‌రావు, సి.వెంకటగోవిందరావు, సిహెచ్‌వి.రాజా శ్రీనివాస్, కె.రాజు, కె.సురేఖ, పి.అరుణశ్రీ, కె.స్వరూప, బి.శివకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పహాడి హాన్‌మాన్ దేవాలయ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : అడ్డగుట్ట బిజెపి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అడ్డగుట్ట బిజెపి నేతలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తుకారాంగేట్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పహాడిహన్‌మాన్ దేవాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డికి అడ్డగుట్ట బిజెపి నేతలు జి.హంసరాజ్, గెల్లు ఉదయ్ యాదవ్, అంబాల మహేశ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

## ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : శ్రీగణేష్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటూ మోటార్ డ్రైవింగ్ ఫీల్డ్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ప్రజా నాయకుడు ఎన్.శ్రీగణేష్ హామీ ఇచ్చారు. ఆదివారం 3వ వార్డు అన్నా నగర్‌లోని ఆటో డ్రైవర్లతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో పార్కింగ్ స్థలాల వద్ద సీసీకెమరాలు ఏర్పాటు చేయుటకు 50 శాతం ఖర్చులు బరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోయూనియన్ అధ్యక్షుడు రాజయ్యగౌడ్, నాయకులు నర్సింహ్మా, వినేయ్, లింగం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మానసికంగా ఇబ్బంది పడుతూ.. విషం తాగి మృతి



ఆత్మహత్యకు పాల్పడిన సుహాస్ (ఫైల్)

తార్నాక, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మానసికంగా ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ కథనం ప్రకారం.. తార్నాకకు చెందిన దయానంద్‌రావు కుమారుడు సుహాస్(28) ఇటీవల మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఆయనను ఇటీవల పేరెంట్స్ మానసిక వైద్యుడికి చూపిస్తున్నారు. ఆదివారం ఉదయం 8గంటల వరకు కూడా బెడ్‌రూంలో నుంచి సుహాన్ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపు తట్టిలోనికి వెళ్లి చూశారు. అప్పటికే ఆయన నోటీలో నుంచి నురుగులు వస్తుండటంతో వెంటనే ఆసుపత్రికి తరలిలించారు. కాని ఆయన అప్పటికే మృతి చెందాడని వైద్యలు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా సుఖసంతోషాలతో జీవించాలని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం 1వ వార్డు బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో జరుగుతున్న 21వ బ్రహ్మోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి సతీమణి మమత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బిఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ యాదవ్, అరుణ్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు జగన్నాథం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో పి.లక్ష్మారెడ్డి వివరించారు. 18న ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏకవార రుద్రాభిషేక మహోత్సవాలు, 6గంటల నుంచి మధ్యాహ్నా 12గంటల వరకు శనికి తైలాభిషేకాలు, 7 గంటల నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు స్వర్ణ పుష్పార్చనలు, సాయంత్రం 6 గంటలకు ఉమామహేశ్వరస్వామి కళ్యాణోత్సవం ఉంటుందని వివరించారు. రాత్రి 9 గంటల నుంచి మహాన్యాస రుద్రాభిషేకాలు, రాత్రి 12 గంటల నుంచి లింగోద్భవం ఉంటుందని, భక్తుల గోత్రనామాలతో అన్ని పూజా కార్యక్రమాలు అర్చకులు నిర్వహిస్తారని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో వేంచేసి ఉన్న క్షీరలింగేశ్వరస్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించి పరమేశ్వరుని కృపకు పాత్రులు కావాలని కోరారు. కాగా శనివారం శని త్రయోదశి సందర్భంగా శనిభగవానునికి తిలతైలాభిషేకాలు జరుగుతాయని వివరించారు.

## చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయి



గాయత్రినగర్‌లోని మెగా కిడ్స్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : చిన్ననాటినుంచే విద్యార్థులకు చదువుతో పాటు వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. ఆదివారం గాయత్రినగర్‌లోని మెగాకిడ్స్ పాఠశాలలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారులు రూపొందించిన వివిధ రకాల నమూనాను చూప రులను ఆకట్టుకున్నాయని చిన్నారులు వారి వారి మేదా శక్తి తో పలు అంశాలను పొందపరిచారు. ఈకార్యక్రమంలో పాఠ శాల కరెస్పాండెంట్ మధుసుచిత్ర పటేల్, చైర్మన్ రఘువీ రనాధ్‌రావు, డివిజన్ టిఆర్ఎస్ అద్యక్షులు ఆయిలయ్య, గాయత్రి నగర్ సంక్షేమ సంఘం అద్యక్షులు సంజీవరెడ్డి, పార్వతమ్మ, జ్ఞానేశ్వర్, యోగి రాజు స్వామి, మల్లిఖార్జున్, నజ్మా, తదితరులు పాల్గొన్నారు.

## లంబాడితండలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: యువత మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా, జీవితలక్ష్య సాధన కోసం అంకితమవ్వాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఎస్ఐ నాగరాజు సూచించారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి లంబాడితండలో కమ్యునిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా యువత మద్యానికి, ధూమపానానికి బానిసలవకుండా, జీవిత లక్ష్యానికి పాటుపడే విధంగా కౌన్సిలింగ్ ఇచ్చే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డెయిల్ 100 ప్రాముఖ్యత, సైబర్‌క్రైమ్‌పై అవగాహ, మాధకద్రవ్యాలపై అవగాహన, తండ కమిటీ ఏర్పాటు తదితర ప్రాముఖ్యత, సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాల్సిందిగా బస్తీ వాసులకు ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## అంబర్‌పేట నియోజకవర్గం బతుకమ్మకుంటలో సిపిఎం ఆందోళన



హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: పెరుగుతున్న నిత్యావసర వస్తూవుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అంబర్‌పేట నియోజకవర్గంలోని బతుకమ్మకుంటలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఆదివారం జరిగింది. పార్టీ అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం.మహేందర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అనేక భారాలను మోపుతోందని, పెట్రోల్, డీజీల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తోందని అన్నారు. ప్రజలకు పనులు లేక ఉపాధి లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళు ఇస్తానని వాగ్దానం చేసిన కెసిఆర్ ప్రభుత్వం నేటికి 9 సంవత్సరాలు అవుతున్నా ఒక్క పేదవాడికి కూడా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కేంద్రం ఆవాజ్‌యోజన పథకం కింద ప్రతిపేదవాడికి ఇళ్ల ఇస్తానని చెప్పిందని, నేటికి ఈ వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు తిరుగుబాటు చేయకముందే ప్రభుత్వం దిగివచ్చి పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, బి.సుబ్బారావు, పి.శేషయ్య, బస్తీ నాయకులు బాలనాగమ్మ, జరీనా, బాలమణి, స్వప్న, మీనా తదితరులు పాల్గొన్నారు.

### రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన వరంగల్ మేడారంలో ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సరలమ్మ మినీ జాతరకు వెళ్తున్న టీపిసిసి అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డికి ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నేతలు డి.బి.దేవేందర్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవుడు, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్ధన్ రెడ్డిలు రేవంత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

## కెసిఆర్ అభివృద్ధిని చూసి బిఆర్ఎస్‌లోకి చేరుతున్నారు: కాలేరు వెంకటేష్



బిఆర్ఎస్‌లో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: రాష్ట్ర సిఎం కెసిఆర్ నేతృత్వంలో మంత్రి కెటిఆర్ పర్యవేక్షణలో అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల నాయకులు బిఆర్ఎస్‌లో చేరుతున్నారని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం నాడిక్కడ బాగ్ అంబర్‌పేట డివిజన్ సాయమధురానగర్‌కు చెందిన జమ్మిచెట్టు బాలరాజు బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి వదవి రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్‌లో కాలేరు సమక్షంలో బాలరాజుతోపాటు మరో వంద మంది కార్యకర్తలు చేరారు. వీరందరికి కాలేరు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిజెపిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు సరైన గుర్తింపు లభించడం లేదని, కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న వారందరూ నిరాశతో పార్టీ నుంచి బయటకు వచ్చి తమ బస్తీలు, కాలనీల అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గత 15 ఎళ్ళుగా ఎమ్మెల్యేగా మూడేళ్ళుగా కేంద్ర మంత్రిగా జి.కిషన్‌రెడ్డి తనకు మేజారిటి ఇచ్చిన అంబర్‌పేటను పూర్తిగా విస్మరించారని తన ఎంపి నిధులను ఖర్చు చేయకపోవడంతో అవి మురిగిపోతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ఆయనకు చెందిన పది కోట్లు నిధులు మురిగిపోవడానికి వచ్చాయని తన పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని కాలేరు విమర్శించారు. సాయిమధురానగర్‌లో స్థానికుల కోరిక మేరకు ఒక కమ్యూనిటిషమాల్‌ను నిర్మిస్తామన్నారు. మహిళలు ఐక్యంగా ముందుకు వస్తే కుట్టు మిషన్ల వంటి వాటిలో శిక్షణ కల్పించి ఉపాధి కల్పిస్తామన్నారు. బిఆర్ఎస్‌లో చేరినవారిలో ఎ.రాములు, ఎం.రాజు, కె.రాజు, టివి శేఖర్ తదితరులతోపాటు టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు రవీంద్రరావు, కోట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10న ఆటో డ్రైవర్లు 'చలో అసెంబ్లీ' ఆందోళన



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బి.వెంకటేశం

సైఫాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన వేలాది మంది ఆటో డ్రైవర్లతో 'చలో అసెంబ్లీ' ఆందోళన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపతామని రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఈ చలో అసెంబ్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జెఏసి నాయకులు బి.వెంకటేశం, మల్లేష్‌గౌడ్, ఎం.డి.అమానుల్లాఖాన్, వి.కిరణ్, ఆర్.మల్లేష్ తదితరులు ఆవిష్కరించి మాట్లాడారు. తాత్కాలికంగా అపివేసిన ఆటో స్క్రాప్ ప్రక్రియను వెంటనే పునరుద్ధరించాలని, ఎపిలో మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఆటో డ్రైవర్‌కు 10 వేల రూపాయలను ప్రతి ఏడాది వాహన ఇన్సూరెన్స్ చార్జీలు తదితర ఖర్చుల కోసం ఇవ్వాలని, ఆటో బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్లను ఆర్థికంగా అదుకోవాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తక్షణమే ఆటో మీటర్ చార్జీలను పెంచాలని, ఓలా, ఓబర్ క్యాబ్‌లకు కొత్త పర్మిట్లు జారీ చేస్తున్న మాదిరిగానే ఆటోలకు కొత్త పర్మిట్లు జారీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిలకు 50 సబ్సీడీలతో ప్రభుత్వం రుణాలు పంపిణి చేయాలని, ప్రైవేటు ఫైనాన్సర్ల దోపిడీని అరికట్టాలని అలాగే ఇతర డిమాండ్లను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5ప్రభాతవార్త: ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్(బిపిటిఎంఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యల సాధన కోసం 14న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టబోతున్నట్లు వివరించారు. ఆదివారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని బిఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరల సమావేశంలో మహాధర్నాకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు అయినా కూడా రాష్ట్రంలో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడంలో చొరవచూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా కోవిడ్ సమయంలో డ్రైవర్లను ఆర్థికంగా సహకారం అందించలేదని, చనిపోయిన డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, సమస్యలు చెప్పుకుందామంటే రవాణా మంత్రి ఎవరో కూడా మనకు తెలియదని, తెలిసినా దగ్గరకు రానీయని పరిస్థితి ఉందని, ఇక సిఎం కెసిఆర్‌కు డ్రైవర్లఅంటేనే చులక అని, ఈ విషయం ఆర్టీసిలో చూస్తున్నామని, ఇక ప్రైవేట్ డ్రైవర్లను ఏ విధంగా చూస్తున్నారో మనకు తెలుస్తూనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మైసయ్య యాదవ్, బిఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ, బిపిటిఎంఎం దక్షిణక్షేత్ర ప్రభారి ఆర్.మహేష్, డీసీఎం, లారీ యూనియన్‌తెలంగాణ కన్వీనర్ సమ్మయ యాదవ్ పాల్గొన్నారు.

## ఆర్టీసి సిబ్బంది పొదుపు చేసుకున్న రూ.300కోట్లను వెంటనే చెల్లించాలి

### ఆర్టీసి జేఏసీ సమావేశం డిమాండ్



ఆర్టీసి జేఏసీ సమావేశం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: సీసీఎస్, పీఎఫ్, ఎస్ఆర్‌బిఎస్, ఎస్‌బిటి కింద ఆర్టీసి సిబ్బంది స్వయంగా పొదుపు చేసుకున్న రూ.300కోట్లను వెంటనే చెల్లించాలని ఆర్టీసి జేఏసీ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం సాయంత్రం విద్యానగర్‌లోని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో టిజెఎంయు జాతీయ ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్‌డబ్ల్యుయు నుంచి సుద్దాల సురేశ్, ఐఎన్‌టియుసి అనుబంధ బిడబ్ల్యుయు నుంచి జి.అబ్రహం, టిఎన్‌టియుసి అనుబంధం కెపి యూనియన్ నుంచుచి బి.యాదగిరి, బిఎంఎస్ అనుబంధ కెఎస్ నుంచి శివకుమార్, స్వాములయ్య, పికె.మూర్తి, బాలస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసికి రూ.6వేలకోట్లు కేటాయించాలని, కొత్త బస్సులను ఖరీదు చేయాలని, వెంటనే నియామకాలు చేపట్టాలని, ఆర్టీసిని ప్రభుత్వం బలోపేతం చేయాలని సమావేశం కోరింది. 2013 తర్వాత ఆర్టీసిలో వేతనాలు పెంచలేదని, ఫలితంగా రెండు వేతన సవరణలు, రెండు డిఏలు ఇవ్వాల్సిన 2013కు సంబంధించిన 50శాతం బాండ్ డబ్బుల బకాయిలు వెంటనే చెల్లించాలని సమావేశం కోరింది. ఆర్టీసిలో పనిభారం పెంచి వివిధ రకాల వేధింపులతో ఆర్టీసి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తూ విధుల నుంచి సస్పెండ్‌చేస్తున్నారని, అటువంటి పద్ధతిని వెంటనే మానుకోవాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరింది. పూర్తిస్థాయి జేఏసీ వేయడానికి 9న సమావేశం కావాలని సమావేశం నిర్ణయించింది.

## జీఎస్టీపై సందేహాలపై అవగాహన సదస్సు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్(అవోపా) హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో బడ్జెట్-2023పై ఆదాయపు పన్ను, జీఎస్టీపై సందేహాలపై అవగాహన సదస్సు ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ప్రముఖ చార్టర్డ్ ఎకౌంటెంట్ బిజినేపల్లి చక్రపాణి, సిఎంఏ మల్లికార్జున్‌గుప్త అవగామన కల్పించారు. అవోపా అధ్యక్ష, కార్యదర్శులు రేణికుంట్ల నమఃశి వాయ, ఎం.రవిగుప్త, కోశాధికారి మాకం బద్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్ జి.కిషన్ హాజరై నగర శివారు ప్రాంతాలలో ఉన్న అనాధ శరణాయాలకు 'అనాథాశ్రమ సేవ' కార్యక్రమం కింద నిత్యావసర వస్తువులు, పండ్లను పంపిణీ చేశారు.

# బడంగ్‌పేట్ బట్టేల్ గుట్టపై నిర్మించిన పార్కు ప్రారంభం


బట్టేల్‌గుట్టపై పార్కును ప్రారంభించిన మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన బట్టేల్‌గుట్ట పార్కు ఆదివారం ప్రారంభమైంది. బడంగ్‌పేట్‌లో కార్పొరేషన్ కార్యాలయ భవనానికి ఆనుకొని ఉన్న పురాతన చారిత్రాత్మకమైన బట్టేల్‌గుట్టపై ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా చక్కని పార్కును నిర్మించాలని నిర్ణయించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అప్పట్లో పార్కు నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అద్భుతంగా తయారైన పార్కును ఆదివారం సాయంత్రం సబితారెడ్డి బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి తదితరులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె పార్కులో కలయతిరిగి పార్కు ఏర్పాటు చక్కగా జరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిఇఇ అశోక్‌రెడ్డి, కార్పొరేటర్లు రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, లిక్కి మమతా కృష్ణారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మర్రి జగన్మోహన్‌రెడ్డి, సమైక్య జ్యోతి, గుర్రం ప్రసన్న వెంకట్‌రెడ్డి, ఖలీల్ పాష, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఎఇఇ రాంప్రసాద్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వై.యాదగిరి, నాయకులు పోరెడ్డి వెంకట్‌రెడ్డి, దండు గణేష్ ముదిరాజ్, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయం : సామ రంగారెడ్డి


సామ రంగారెడ్డికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** లైఫ్ సేవర్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శివనేత ఆధ్వర్యంలో లైఫ్ సేవర్, రెడీ టు సర్వ్ ఫౌండేషన్ నేతృత్వంలో కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ సిపిఓ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు రక్తంకోసం ఎందరో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శివనేత శిబిరాన్ని నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలబడ్డాడని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్లు పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి, అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, గడ్డిఅన్నారం అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, డాక్టర్ బి.విజయరంగా, డాక్టర్ సతీష్, డాక్టర్ మార్కండేయ, ప్రశాంత్, విజయ్‌నేత, బొగ్గరపు వరుణ్, యు.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం భక్తుల కోలాహలమధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. చైతన్యపురిడివిజన్ హనుమాన్‌నగర్ కాలనీలో మల్లేష్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విట్టల్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల్‌రెడ్డి, ఎస్.కె.జాఫర్, వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్, అంగత్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కాంగ్రెస్ జోడో యాత్ర పోస్టర్ అవిష్కరణ


జోడో యాత్ర పోస్టర్ అవిష్కరిస్తున్న పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి, అకారపు అరుణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర పోస్టర్‌ను ఆదివారం పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి అవిష్కరించారు. నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్‌ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను రేవంత్‌రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో సోమవారం నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర చేపడుతున్నామని, పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డికి మద్దతుగా యాత్ర చేపడుతున్నామన్నారు. జనం కోసం జనంలోకి అనే పేరుతో పోస్టర్‌ను రూపొందించామని, ఉప్పల్‌నుంచి రామంతాపూర్ మీదుగా అన్నిడివిజన్ల వీధుగా యాత్ర సాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోటేష్, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు శివకాంత్, ప్రధాన కార్యదర్శి రాకేష్, బాబీరెడ్డి, రేవంత్, ఉదయ్, మహేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : చింతల రవికుమార్


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న చింతల తదితరులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత పాల్గొని ఉద్యోగాలు పొందాలని వనస్థలిపురం డివిజన్ బిఆర్ ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త తమ వాట్సాప్ గ్రూపులలో పొందుపర్చాలన్నారు. 120కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్న మెగా జాబ్‌మేళా ద్వారా 10వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్‌గౌడ్, నాయకులు మధుగౌడ్, వేములయ్యగౌడ్, సంజయ్‌కుమార్, పివి నర్సింహ్మారావు, రాజునాయీా, ఆనంద్‌రాజ్ తదితరులు

# సోషల్ మీడియా వేదికగా ప్రజా సమస్యలపై ప్రశ్నించాలి: అందెల


అందెల సమక్షంలో బిజెపిలో చేరిన శ్రీరామకాలనీ యువకులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** సోషల్ మీడియా వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలపై యువత ప్రశ్నించాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీకి చెందిన పలువురు యువకులు ఆదివారం బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ప్రశాంతి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాములు పార్టీలో చేరిన వారికి కాషాయ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీపై బిజెపి జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. దేనికీ భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శాంతకుమార్, మనోజ్, గొరిగె మల్లేష్, హరికృష్ణ, సుమిత్, శ్రవణ్, రాజేందర్, బాలకృష్ణ, సుధాకర్, కృష్ణ, నాగరాజు, గణేష్, ఫాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సేవా రత్న అవార్డు అందుకున్న శివశంకర్ శాస్త్రి


శివశంకర్ శాస్త్రికి అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

**సైదాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ఎల్బినగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ సాయిబాబ దేవాలయం అర్చకులు పందరి శివశంకర్ శాస్త్రి భారతీయ సేవారత్న అవార్డును అందుకున్నారు. స్పూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్‌జిఓ నుండి ఆయన ఈ అవార్డును నగరంలోని తెలంగాణా సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. కాగా శివ శంకర్ శాస్త్రి గతంలో బెస్ట్ పురోహిత్, అర్చక వైభవ సామ్రాట్, పురోహిత రత్న, ధార్మిక సేవా శిఖర అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఛైర్మన్ రామకృష్ణగౌడ్, స్పూర్తి సర్వీస్ సొసైటీ ఛైర్మన్ ఆకుల రమేష్, సరస్వతి దేవి ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన కంపెనీ ప్రతినిధులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ప్రైవేటు కంపెనీలు కనిపిస్తున్న ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. ఈ నెల 11న సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో పలు కంపెనీ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ గత రెండు, మూడు రోజుల నుంచి వివిధ మాధ్యమాల్లో జాబ్‌మేళా ప్రకటనలు వస్తున్నాయన్నారు. అందులో భాగంగా మరికొంత మందికి ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలనే ఆశయం ఎంతో గొప్పద ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వడానికి ముందుకు వచ్చిన కంపెనీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మెగా జాబ్ మేళాను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి : చైర్మన్ వాసుదేవరెడ్డి

**మలక్‌పేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 11 న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డా.కెవాసుదేవరెడ్డి కోరారు. ఈ మేరకు వారు శనివారం పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఈ మెగా జాబ్ మేళాలో 108 కంపెనీలు 10 వేలకు పైగా ఉద్యోగాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. కనీస చదువు 7 వ తరగతిగా కేటాయించారని ఎంపికయిన వారికి ప్రారంభ జీతం రూ.15 వేల నుండి గరిష్టంగా రూ.1 లక్ష వరకు ఉంటుందని దివ్యాంగులకు కూడా అవకాశాలు కల్పిస్తారని వివరించారు. జాబ్ మేళా వివరాల కొరకు 7286008234, 95054 37112, 8247768371 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# క్రాస్ బో క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : ఎమ్మెల్యే బలాల


క్రాస్ బో క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు చిత్రంలో యిర్మియా తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** క్రాస్ బో క్రీడాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్ దేవదానమ్మ బస్తీకి చెందిన నలుగురు క్రాస్ బో క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలలో పాల్గొని పతకాలను సాధించారు. రాష్ట్ర క్రాస్ బో షూటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కునదొడ్డి యిర్మియా ఆధ్వర్యంలో బంగారు పతకాలు సాధించిన అనోక్‌దీపక్, సెల్లా దీపిక, ఎలిజబెత్, రజత పతకం సాధించిన రచేల్‌లు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కనుల పండువగా శ్లోక స్కూల్ వార్షికోత్సవం


సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: బాలాపూర్ చౌరస్తా ఆర్‌సిఐ రోడ్డులోనున్న శ్లోక స్కూల్ 5వ వార్షికోత్సవ వేడుకలు శనివారం కనుల పండువగా జరిగాయి. త్రివేణినగర్ కాలనీలో పాఠశాలకు సంబంధించిన గ్రౌండ్‌లో అంకుర్-2024 పేరిట వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు పట్లోరి కృష్ణారెడ్డి, దీపలు జ్యోతి ప్రజ్వలన చేసిన వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించగా ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్ పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కాగా వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన అద్భుత కళా, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : సుంకోజు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణమాచారి, మధుసూధన్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి అన్నారు. బిఆర్‌ఎస్ నాయకులు గజ్జెల మధుసూధన్‌రెడ్డితోకలిసి జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ 120కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్న మెగా జాబ్‌మేళా ద్వారా పదివేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కే అవకాశముందన్నారు. జాబ్‌మేళా గురించి ప్రతి ఇంటికి చేరేలా బిఆర్‌ఎస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, పెంటయ్యగౌడ్, నందు, గౌర శ్రీనివాస్, రమాదేవి, అనసూయ, శివ, జగదీష్, సతీష్, గోపాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు పంపిణీ


ఉప్పల్‌లో జోడో యాత్ర వివరాలు వెల్లడిస్తున్న బోరంపేట కృష్ణ, బాకారం లక్ష్మణ్, రామకృష్ణ, దేవిరెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22 వార్డు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, కోఆప్షన్ సబ్యులు కాకుమాను మరియమ్మ చెన్నయ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలయ్య ఆదివారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంచే 3 లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వంచే 2 లక్షల రూపాయలు మొత్తం 5 లక్షల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంగా హెల్త్ బీమా పథకంలో అమర్చడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని తెల్ల రేషన్ కార్డుకు సంబంధించిన వారందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వెంకటేశ్‌యాదవ్, శ్రీనివాసచారి, ఇందిరమ్మ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు హనుమంత్ గౌడ్, జనరల్ సెక్రెటరీ సైదులు గౌడ్, కోశాధికారి శంకర్, ఉదయ్ కుమార్, షఫీ, శంకర్ నాయక్, జఫర్ నాయక్, బొమ్మరాజు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు


కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రమణి సిద్ది ఆధ్వర్యంలో నెలనెలా కళారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వర రాగసుధ సంగీత విద్యాలయం కాకినాడ గురువు విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి శిష్య బృందం ఆధ్వర్యంలో పద్మ పదక్, ఉదయ లక్ష్మి, సువర్ణ గాత్ర కచేరి నిర్వహించారు. శ్రావ్య మృదుల శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చిందని నిర్వహకులు తెలిపారు.

# నాచారం రెడ్డి సంఘం నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ


రెడ్డి సంఘం కేలండర్ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

**నాచారం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** నాచారం రెడ్డి సంఘం నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, నమివి కొండ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాచారంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాల్లాపూర్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డి, బిజేపీ సీనియర్ నాయకులు ఎంపాల పద్మారెడ్డి, ఎంపాల అనిత పద్మారెడ్డి, రాష్ట్ర రెడ్డి జేఏసీ నాయకులు హరినాథ్‌రెడ్డి హాజరై మధుకర్‌రెడ్డి, ఇ.రాంచంద్రారెడ్డి, పోగుల వెంకటర రమణారెడ్డి, రాగిరి మోహన్‌రెడ్డి, కాటెపల్లి రవీందర్ రెడ్డి, నందికంటి శ్రీనివాస్‌రెడ్డి, బెక్కరి రవీందర్‌రెడ్డి, జి. కృష్ణారెడ్డితో పాటు పలువురు పాల్గొని రెడ్డి సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎ.హ్మానంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, మధుసూదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విష్ణురెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వీరప్రతాప్‌రెడ్డి, మెహన్‌రెడ్డి, జ్యోతి, ముత్యంరెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ గాంధీనగర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


మంత్రిని సన్మానిస్తున్న పెద్దబావి ఆనంద్‌రెడ్డి, శోభలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మణ సీత హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామి, శివపంచాయతనయ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానిక 29వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డి దంపతుల పర్యవేక్షణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు నవగ్రహాలు, ఆలయ ధ్వజ స్థంభం ప్రతిష్ఠలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, లిక్కి మమతా కృష్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, చప్పిడి సంతోష్‌రెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్, పెద్దబావి మహేందర్ రెడ్డి, గాంధీనగర్‌వాసులు మణెమ్మ, సత్యనారాయణ, మల్లేష్, రఘుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పల్లవి మెడల్ స్కూల్లో ఆకట్టుకున్న నొస్టాల్జియా


కార్యక్రమంలో పాల్గొన్న విధ్యార్థులు

**తార్నాక, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** పల్లవి మెడల్ స్కూల్లో ఆద్వర్యంలో 12వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల కోసం నొస్టాల్జియా 2022..23 పేరుతో నిర్వహించిన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. సీనీయర్లకు వీడ్కోలు పలికేందుకు ఈవేడుకను జూరియర్లు నిర్వహించారు. అందమైన దుస్తులు దరించి సీనిరయర్స్‌ను ఆహ్వానించే కార్యక్రమం అందరిని ఆకుట్టుకుంది. పల్లవి స్కూల్స్ చైర్మన్ మల్కా కొమురయ్య వర్చువల్‌గా హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి కష్టపడి చదివి జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ శైలజా రెడ్డి మాట్లాడుతూ స్కూల్లో నేర్చుకున్న సంస్కారం, వివేకం, జ్ఞానాన్ని విద్యార్థులు జీవితాంతం కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిద సాంస్కృతిక కార్యక్రమాలు చేసి ఆకట్టుకున్నారు. ర్యాంప్‌పై విద్యార్థులు నడిచి చూపరులను విశేషంగా ఆకుట్టుకున్న పోటీల్లో మిస్ పల్లవి కిరిటాన్ని నిదా హుస్సేన్ గెలుచుకోగా మిస్టర్ పల్లవి మహ్మద్ అబ్రార్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాగర్ రింగు రోడ్డు సుందరీకరణ : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


సాగర్ రింగురోడ్డు వద్ద అధికారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** సాగర్ రింగు రోడ్డు నుంచి ఇబ్రహీంపటన్నం వైపు వెళ్లే దారిలో డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జోనల్ కమీషనర్ పంకజ మరియు ఇతర అధికారులతో కలిసి సాగర్ రింగు రోడ్డు పరిసర ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బినగర్ రూపు రేఖలు మార్చి అద్భుతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రోడ్లపై వెళ్లే ప్రయాణీకులకు రోడ్లు శుభ్రంగా కనువిందు చేసేలా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి మహోత్సవం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** కొత్తపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం ట్రస్ట్‌లో ఈనెల ఏడవ తేదీ నుంచి 11వతేదీ వరకు శ్రీవాసవి కన్యాకపరమేశ్వరిదేవి ప్రాణ ప్రతిష్టాపన, మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పబ్బా బాలయ్య, వైస్‌చైర్మన్ జనంపల్లి నరసింహయ్యలు తెలిపారు. మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మి, సంతోషిమాత, ఆంజనేయ స్వామి, బాలత్రిపుర సుందరి సమేత శ్రీనగరేశ్వరస్వామి వారి ఉప ఆలయాలతో కూడిన దేవాలయంలో మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దేవతామూర్తుల కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

# రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటి ఏకగ్రీవ ఎన్నిక


రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప్పల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు టిపిసిసి ప్రతినిధి ఎం.డి.తౌఫిక్, సీనియర్ నాయకులు తవిడబోయిన గిరిబాబు సమక్షంలో కమిటి నియామకం జరిగింది. రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటి వర్కింగ్ ప్రసిడెంట్‌గా వల్లపు శ్రీకాంత్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా జి.విజయ్‌భాస్కర్, వంగాల సతీష్, ప్రధాన కార్యదర్శిగా పెద్దిరాజు సందీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా మద్దూరి రాకేష్, శ్రీనివాస్‌గౌడ్, కార్యనిర్వహక కార్యదర్శిగా నర్సింగ్ శంకర్, మెంగ రవి, ఎస్.జంగయ్య, కార్యదర్శిగా నరసింహా, వంశీ యాదవ్, సాయి ముదిరాజ్‌లను ఎన్నుకున్నట్లు కమిటి నేతలు తెలిపారు. రామంతాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# నిరు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : లచ్చిరెడ్డి


వైద్య శిబిరంలో పాల్గొన్న లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** పేదలు నివాసముండే బస్తీలు, మురికివాడల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వారికి వైద్య సేవలు అందించాలని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-2లో భృంగి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వైద్యులు శిబిరానికి వచ్చిన కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఛైర్మన్ శిరీష్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు శివకుమార్, మోహన్‌రెడ్డి, ముదుపు సందీప్‌రెడ్డి, సాయిరెడ్డి, దిలీప్‌రెడ్డి, భావనారుషి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా ధ్వజ స్థంభ ప్రతిష్టాపన


ధ్వజ స్థంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, చైర్మన్ పూర్ణచందర్‌రావు తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్ ఎస్‌బిఐ ఆఫీసర్స్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్థంభ ప్రతిష్టాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి హాజరై ఆలయ కమిటీ ఛైర్మన్ పూర్ణచందర్‌రావు తదితరులతో కలిసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయాన్ని అన్ని విదాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎన్ హరీష్, విశ్వేశ్వరరావు, కుమార్ పురోహిత్, విజయ్, కృష్ణారావు, నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, సందీప్, ఉదయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.